క్లుప్తంగా

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో రాణించాలి



జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

మద్దికెర: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, మండల విద్యాధికారి రంగస్వామి అన్నారు. సోమవారం మద్దికెరలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని గ్రామ పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎంతో మంది దివ్యాంగులు వైకల్యాన్ని జయించి మనోధైర్యంతో విజయాలు సాధించారని వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఏపీఎం మధుబాబు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, దివ్యాంగులు హనుమంతు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: స్థానిక భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వం దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం జాతీయస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. హెచ్ఎం సత్యనారాయణ, లీగల్ అడ్వైజర్ షాకీర్ సహిత ఉపాధ్యాయుడు రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ఎస్ఐగా సి.శరత్‌కుమార్‌రెడ్డి



ఎమ్మిగనూరురూరల్: ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐగా సి.శరత్‌కుమార్‌రెడ్డి సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ నిరంజన్‌రెడ్డి నంద్యాల జిల్లా రుద్రవరంకు బదిలీ కాగా రుద్రవరం నుంచి సి.శరత్‌కుమార్‌రెడ్డి ఎమ్మిగనూరుకు బదిలీపై వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలు అందరి సహకారంతో సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. స్థానిక పోలీసులు పుష్పగుచ్చం ఇచ్చి ఆహ్వానం పలికారు.

ఆలయ ధర్మకర్తల మండలి నియామకం

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో వెలసిన కొలుట్ల చెన్నకేశవ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నూతన కమిటీ సోమవారం ఏర్పాటయ్యింది. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా పి.కోటకొండకు చెందిన ఆర్.హనుమంతరెడ్డి, సభ్యులుగా సి.మహాలింగడు, ఎం.రాజేశ్వరి, వై.వెంకటలక్ష్మి, ఆర్.వెంకటేశ్వరరెడ్డి, సి.లక్ష్మి, మంగలి చంద్రయ్య, మాజీ అఫిషియో సభ్యులుగా పూజారి వేణుగోపాల్‌ను నియమించారు. దేవదాయ తనిఖీ అధికారి వెంకటేశ్వర్లు, ఈఓ చంద్రశేఖర్ రెడ్డి వారిచే ప్రమాణం చేయించారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని వారు పేర్కొన్నారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు



చెరుకులపాడు జెడ్పీ పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: పిల్లల్లో రక్తహీనత నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని రాష్ట్రీయ బాలస్వాస్థ్య అధికారిని డాక్టర్ హేమలత తెలిపారు. కృష్ణగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చెరుకులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆమె విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే ఫోలిక్ యాసిడ్ మాత్రలు క్రమం తప్పకుండా వాడడం వల్ల రక్తహీనతను నివారించవచ్చన్నారు. శరీరంలో ఐరన్ చాలా కీలమైనదని, ఆహారంలో ఐరన్ లోపం ఉంటే విద్యార్థులు నీరసం, నిస్సత్తువతో చదువులో కూడా వెనుకబడిపోతారన్నారు. సరైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత నుంచి బయటపడవచ్చన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం జయశీల, ఆరోగ్య కార్యకర్త అన్నపూర్ణ, ఖలీల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శబరిమలకు ఆర్టీసీ అద్దె బస్సు సౌకర్యం

ఎమ్మిగనూరుటౌన్: శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుంచి అద్దె ప్రాతిపదికన బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు డిపో మేనేజర్ అమర్నాథ్, అసిస్టెంట్ మేనేజర్ జివి.నాగరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక డిపోలో కరపత్రాలను విడుదల చేశారు. సూపర్ లగ్జరీ బస్సు కిలోమీటర్‌కు రూ.57, అల్ట్రా డీలక్స్ కిలోమీటర్‌కు రూ.61, ఎక్స్‌ప్రెస్ బస్సు కిలోమీటర్‌కు రూ.62 ప్రకారం అద్దె వసూలు చేయనున్నట్లు చెప్పారు. వీటిపై ఎలాంటి ఆర్టీఓ పన్నులుండవని, రోజువారీ అద్దె 420 కిలోమీటర్ల మేర లెక్కించడం జరుగుతుందన్నారు. బస్సు బుక్ చేసిన గురుస్వామి, ఏటీబీ ఏజెంట్‌కు రూ.2 వేల ప్రోత్సాహకం అందిస్తామని, బస్సులో వంట మనిషి, ఇద్దరు కన్నె స్వాములకు ఉచితంగా సీటు కల్పించనున్నట్లు తెలిపారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

వెల్దుర్తి(కృష్ణగిరి): సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పరిపాలన సాగిస్తూ, అని వర్గాల ప్రజలకు మంచి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకుందామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం ఆమె చెరుకులపాడులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా గ్రామ కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల తమ ప్రభుత్వంలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని గర్వంగా ప్రతి గడపకు వెళ్లి వివరిస్తున్నామని, సచివాలయాలలో వివరాల బోర్డును ప్రదర్శిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రూ.వేల కోట్లలో సంక్షేమ పథకాల అమలు కావడం, అభివృద్ధి పనులు జరగడం, శాశ్వత పరిష్కారాలు లభించడం సంతోషించదగ్గ విషయమన్నారు. నాయకులు కంగాటి వాసంతి, వెల్దుర్తి సహకార సొసైటీ చైర్మన్ వంశీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, సర్పంచ్ రాములమ్మ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాలహర్వి: అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా భావిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్, మహేంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పార్టీ మండల కన్వీనర్ భీమప్ప చౌదరి ఆధ్వర్యంలో మండలంలోని సిద్ధాపురం గ్రామంలో 'ఏపీకి జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. సిద్ధాపురం గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.16,16,98,282 లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల గణాంక వివరాలతో బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ మారెన్న, జెడ్పీటీసీ లింగప్ప, పరశురామ్, గాదిలింగప్ప, వన్నూరప్ప, శ్రీనివాసులు, రంజిత్, బజారప్ప, లింగమల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని మాచాపురం గ్రామంలో జెడ్పీటీసీ రామకృష్ణ ఆధ్వర్యంలో 'ఏపీకి జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మండల జేసీఎస్ కన్వీనర్ రాజారెడ్డి, ఉమ్మంబా, నిజాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని, అందరూ ఆశీర్వదించాలని సచివాలయ మండలాధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్, హనుమంతు కోరారు. జొన్నగిరి సచివాలయం-2లో సోమవారం సంక్షేమ అభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్ల జగనన్న పాలనపై ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. పార్టీ నాయకులు నాగప్ప, మోహన్‌రెడ్డి, రఘు, లోకనాథ్‌రెడ్డి, పక్కీరప్ప, తెరప్ప, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: నాలుగున్నరేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని చేతల్లో చూపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల తలరాత మార్చారని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని టి.గోకులపాడు, తొగర్చేడు గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం ఆయన వైస్ ఎంపీపీ బోయ సుశీల, ఎంపీటీసీ రామేశ్వరమ్మ, పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడుతో కలిసి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామ సచివాలయాల్లో సంక్షేమ వివరాల బోర్డులను ఆవిష్కరించి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, దస్తగిరి, రామచంద్రుడు, రాజారెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందవరం: పేదల సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ చాంద్‌బాషా అన్నారు. సోమవారం మండల పరిధిలోని పెద్దకొత్తిలి గ్రామ సర్పంచ్ శివన్న, ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. పెద్దకొత్తిలి గ్రామ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా రూ.22.82 కోట్లు అందించినట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు విరుపాక్షిరెడ్డి, నరసింహులు, రాముడు, వీరారెడ్డి, మల్లేష్, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెరుకులపాడులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



సిద్ధాపురంలో సంక్షేమ బుక్‌లెట్‌ను అందిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్, మహేంద్ర



టి.గోకులపాడులో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



గురజాలలో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జొన్నగిరిలో ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మాచాపురంలో సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే వైద్యం



నందవరంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఫ్యామిలీ డాక్టర్' విధానంతో ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్ రేవతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయం-1 పరిధిలో గర్భిణులు, వృద్ధులు, బాలింతలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తామన్నారు. మంచి చికిత్సతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని వివరించారు. బాలింతలు, గర్భిణులకు టీకాలు వేసి, వ్యక్తిగత శుభ్రత, పౌష్టికాహారంపై సలహాలు, సూచనలు అందించారు. వృద్ధులు, గర్భిణులకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి చేయూత



ఎస్ఎంఎల్ కళాశాలలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వై.సీతారామిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తమ వంతు చేయూతనందిస్తామని టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల ప్రధాన ద్వారం నుంచి అడ్మినిస్ట్రేటివ్ భవనం వరకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో మంజూరైన రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రిన్సిపాల్ మహబూబ్ బాష, హనుమాపురం గ్రామ సర్పంచ్ పూజారి ఈరన్న, తదితరులతో కలిసి సోమవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కళాశాలల అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని, ఏమైనా సమస్యలుంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మూకయ్య, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అద్వితీయం.. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



నందవరంలో ప్రతిష్ఠించిన నవగ్రహాలు, ఆంజనేయ స్వామి, నాగప్ప, సుబ్రహ్మణ్యేశ్వర, దత్తాత్రేయ స్వామి మూల విరాట్‌లు

నందవరం: మండల కేంద్రంలోని శ్రీ గురు బసవ లింగ తాత మఠంలో విగ్రహ, ధ్వజ స్తంభ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సోమవారం మఠంలో బసవ లింగేశ్వరుడి, దత్తాత్రేయ, సుబ్రహ్మణ్య, పంచముఖి అంజనేయ స్వామి, నవగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన జగద్గురు శ్రీ చెన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య స్వామి, హరగురు శివాచార్యుల అమృత హస్తలతో వైభవంగా నిర్వహించారు. విగ్రహాలకు జల, ధాన్య, దీక్షహోమాలు, కూష్మాండ బలిదానం, ప్రాణ ప్రతిష్ఠాపన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పిండి వంటలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే గ్రామంలోని రాజ రాజేశ్వరి దేవస్థానంలో లక్షదీపోత్సవం ఘనంగా నిర్వహించారు.


సేవాదళ్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ



పత్తికొండలో మహిళలకు చీర అందజేస్తున్న పి.మురళీధర్‌రెడ్డి

పత్తికొండ రూరల్: ప్రజలకు మరింత మెరుగైన సేవలందిస్తామని పోచిమిరెడ్డి సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి అన్నారు. సేవాదళ్ ఆధ్వర్యంలో స్థానిక కుమ్మరి వీధిలో గడప గడపకూ వెళ్లి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా స్థానిక శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. జగనన్నకు తోడుగా.. పేద ప్రజలకు అండగా ఇప్పటికే సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత ప్యూరిఫైడ్ వాటర్, నిరుద్యోగులకు ఉచిత కోచింగ్, మహిళలకు టైలరింగ్ శిక్షణ, ఉపాధి అవకాశాలు, వైకుంఠ రథం తదితర సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఎంపీటీసీ అనిత, నెనావత్ సరోజ, వార్డు మెంబర్లు బోడాసావిత్రి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. కార్తీక దీపోత్సవం



సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శివలింగం ఆకారంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పల్లకీలో ఆశీనులైన పీఠాధిపతి చెన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్యులు

హొళగుంద: మండల కేంద్రంలో వెలసిన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కార్తీక దీపోత్సవం వైభవంగా జరిగింది. జంగమర హొసల్లికి చెందిన శంభులింగ శివాచార్య మహాస్వాములు దీపోత్సవాన్ని ప్రారంభించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైదానంలో భక్తులు ఈశ్వర, శ్రీ, ఓం తదితర ఆకారాల్లో దీపాలు వెలిగించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్‌ల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కార్తీక వేడుకలో శ్రీశైలం పీఠాధిపతి

నందవరం: మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఆలయం, గురు బసవలింగ తాత మఠంతో జరిగిన కార్తీక మాస వేడుకల్లో శ్రీశైల పీఠాధిపతి చెన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్యులు పాల్గొన్నారు. ఉదయం ఆలయంలో దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా చేపట్టారు. రాత్రి లక్ష దీపోత్సవ వేడుక చేపట్టగా శ్రీశైలం స్వామిజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరశైవ లింగాయతీ సంఘం ఆధ్వర్యంలో స్వామిజీని పల్లకీలో ఊరేగించారు. అనంతరం స్వామిజీ రాజరాజేశ్వరి దేవి, బసవలింగ తాత దర్శనాంతరం లక్ష దీపోత్సవానికి అంకురార్పణ పలికారు.

ఆయుష్మాన్ భారత్ పేదలకు వరం

గోనెగండ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆయుష్మాన్ భవ, ఆరోగ్యశ్రీ పథకాలు పేదలకు ఓ వరం అని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్నమరివీడు, పెద్దమరివీడు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పేదలందరికీ పక్కాగృహాలు పథకం ద్వారా ఇళ్ల నిర్మాణాలు, పేదలకు ఉచిత రేషన్ బియ్యం లాంటి 17 రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈఓఆర్డీ నాగేష్, సర్పంచ్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన క్రీడా సామగ్రి

చిప్పగిరి: ఈ నెల 15వ తేదీ నుంచి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి సంబంధించి క్రీడా సామగ్రి సోమవారం మండలానికి చేరింది. ఈ సామగ్రిని ఎంపీడీఓ సీవీ కొండయ్య పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 9 గ్రామ సచివాల యాల పరిధిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ తదితర క్రీడలకు సంబంధించి ఒక్కో గ్రామ సచివాలయానికి రెండు కిట్ల చొప్పున సామగ్రి వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే క్రీడాకారుల పేర్ల నమోదును ప్రారంభించినట్లు చెప్పారు. పీఓ శ్రీనివాసులు, పీఈటీ బాష తదితరులు ఉన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

దేవనకొండ: మండలంలోని మాచాపురం గ్రామానికి చెందిన ఉప్పరి బజారి, వెంకటేష్‌లకు 6 నెలల జైలు శిక్ష, రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ పత్తికొండ మెజిస్ట్రేట్ దివ్య ఉత్తర్వులు జారీ చేశారని ఎస్ఐ భూపాలుడు సోమవారం తెలిపారు. 2016 జనవరి 4న గ్రామానికి చెందిన ఉప్పరి దానమ్మ పొలంలో పనిచేసుకుంటుండగా బజారి, వెంకటేష్ అసభ్యంగా తిట్టి, కొట్టారని బాధితురాలు దేవనకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నేరం రుజువు కావడంతో నిందితులకు 6 నెలల జైలుశిక్ష, రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

'ఆడుదాం - ఆంధ్ర' విజయవంతం చేద్దాం

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం - ఆంధ్ర' క్రీడా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ దశరథరామయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఉప్ప సర్పంచ్ శివారెడ్డిగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గ్రామ సచివాయలం-3లో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. క్రీడలకు సంబంధించి బ్రోచర్లను విడదల చేసి గ్రామ వలంటీర్లకు అందజేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 15 ఏళ్లు దాటిన క్రీడాకారులను గుర్తించి వలంటీర్లు రిజిస్ట్రేషన్ చేయాలని, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. గెలుపొందిన క్రీడకారులకు బహుమతులతో పాటు ప్రైజ్ మనీ కూడా ఉంటుందని వివరించారు. బీఎల్ఓ బాబులాల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలోని జాతీయ రహదారి-44పై లద్దగిరి క్రాస్ రోడ్డు వద్ద కంప చెట్ల మధ్యలో నాయకంటి సుంకన్న (50) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వెల్దుర్తి మండలం, రత్నపల్లి గ్రామానికి చెందిన నాయకంటి సుంకన్న, రామేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరి కుటుంబం పదేళ్ల క్రితమే రామేశ్వరి పుట్టినిల్లు కోడుమూరు మండలం, లద్దగిరిలో స్థిరపడ్డారు. తమకున్న మూడెకరాలతోపాటు మరో ఐదెకరాలు పొలం కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. పంటసాగుతో పాటు కుటుంబ ఖర్చుల నిమిత్తం చేసిన అప్పులు రూ.8 లక్షలకు చేరాయి. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన కర్నూలుకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగిరాలేదు. 3వ తేదీ కోడుమూరు పోలీస్ స్టేషన్‌లో కుటుంబసభ్యులు మిస్సింగ్ కేసు ఇచ్చారు. ఇంతలో సోమవారం వెల్దుర్తి జాతీయ రహదారి పక్కన సుంకన్న శవమై కనిపించాడు. ఘటనా స్థలంలో పురుగు మందు డబ్బా పడి ఉండటంతో అప్పుల బాధతో విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. కోడుమూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రామేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ రాముడు తెలిపారు.

పాడి రైతులకు అండగా ప్రభుత్వం



యానిమల్ హెల్త్ కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): పాడి పశువులు, గొర్రెలు, ఇతర మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలందిస్తూ ప్రభుత్వం పాడి రైతులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామంలో సోమవారం ఆర్బీకే పరిధిలో వెటర్నరీ విలేజ్ లైవ్ స్టాక్ ఆఫీసర్ (వీవీఎల్ఓ) ఉమా మహేశ్వరి ఆధ్వర్యంలో పాడి రైతులకు యానిమల్ హెల్త్ కార్డులను కంగాటి వాసంతి, వెల్దుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, సర్పంచ్ రాములమ్మలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరుకులపాడు ఆర్బీకే పరిధిలో దాదాపు 700 పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు మంజూరుకావడం సంతోషమన్నారు. అలాగే వైఎస్సార్ పశు బీమా పథకం కింద పాడి పశువులు మృత్యువాత పడితే యజమానులకు పరిహారం అందించి ఆదుకుంటున్నట్లు చెప్పారు. యానిమల్ హెల్త్ కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలపై వీవీఎల్ఓ అవగాహన కల్పించారు. పశువుల బీమా గురించి వివరించారు. పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చిప్పగిరి: మండలంలోని రామదుర్గం, నగరడోణలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సెక్టోరల్ ఆఫీసర్ విజయ లక్ష్మి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నగరడోణలోని 146, 147, రామదుర్గంలోని 101, 102, 103 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పలువురు బీఎల్ఓలు ఉన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



పత్తికొండ గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం

పత్తికొండ రూరల్: మేజర్ గ్రామ పంచాయతీలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శించరాదని గ్రామ పంచాయతీ గౌరవ సలహాదారు ఎస్.నాగరత్నమ్మ, సర్పంచ్ కొమ్ముదీపిక సూచించారు. సోమవారం పత్తికొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈఓ నరసింహులు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. పారిశుద్ధ్యం, వీధిలైట్లు, తాగునీటి సదుపాయం తదితర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఉచిత కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు తీర్మానం చేశారు. ప్రజల సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పలువురు వార్డు మెంబర్లు గ్రామ పంచాయతీ కాంప్లెక్స్‌లో షాపుల నిర్వహణకు రెండేళ్ల కిందట వేలం పాటకు చెల్లించిన రూ.2 లక్షలకు పైగా నగదు ఏమైందని ప్రశ్నించారు. తిరిగి పాతవారికే షాపులు అద్దెకిచ్చినప్పుడు వేలం పాడేందుకు కట్టిన డబ్బును ప్రజలకు వాపసు చేయాలని కోరారు. పంచాయతీ పరిధిలోని విలువైన స్థలంలో ఏర్పాటుచేసిన గుజిరీని తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించే సిబ్బందిని తొలగిస్తామని హెచ్చరించారు. వార్డు సభ్యులు సురేంద్ర, లింగన్న, రంగన్న, రామాంజినేయులు, శివరాముడు, మస్తాన్‌వలి, గుండు మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించాలి



మాట్లాడుతున్న ఎస్ఆర్పీ మల్లికార్జున

నందవరం: గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులు, అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్‌కు ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, వివిధ శాఖల అధికారులు సహకరించాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ మల్లికార్జున, ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, డీఆర్పీలు, ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వ వరకు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులు, అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు. ఆయా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు డీఆర్పీలకు సహకరించాలని సూచించారు. గ్రామాలలో చేసిన పనులను చూపించి తనిఖీ చేయించాలన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో తనిఖీ ఉంటుందని వివరించారు. 14న మండల కేంద్రంలో బహిరంగ సమావేశం నిర్వహించనునట్లు తెలిపారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, పీఆర్ ఏఈ జయన్న, ఏపీడీ అల్లిపీరా, ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, డీఆర్పీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.